క్లుప్తంగా

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

నకరికల్లు: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.నాగసురేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండమోడు సమీపంలో తుపాను కారణంగా ఒరిగిపోయిన రెండు స్తంభాలకు, అలాగే పలుచోట్ల సుమారు పది స్తంభాలకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మరమ్మతుల సమయంలో స్థానికులు సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంకొండ: శీతాకాలం సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు కె.వి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక వైద్యశాలలో సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ కాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మందులు పంపిణీ చేశారు.

నేడు నిత్యావసరాల పంపిణీ

నకరికల్లు: మండలంలోని అన్ని సచివాలయాల వద్ద ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కె.నగేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి ఎండీయూ వాహనాల రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయాల్లో రేషన్ బియ్యం..

సత్తెనపల్లి: రేషన్ తీసుకోని కార్డుదారులకు ఆదివారం వార్డు, గ్రామ సచివాలయాల్లో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎస్.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

క్రోసూరు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



క్రోసూరు: మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వి.నరసింహరావు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గుంటూరు నుంచి క్రోసూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు సందర్శిస్తానని, శాంతి భద్రతలను కాపాడుతానన్నారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పెదకూరపాడు: మండలంలోని కస్తల గ్రామంలో శనివారం లాంఫాం శాస్త్రవేత్తలు పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.శ్రీలక్ష్మీ, వెంకటలక్ష్మీ, దయానా మాట్లాడుతూ రైతులు ఇప్పటికే పత్తి మూడు తీతలుగా తీశారని, 160 రోజులకు మించి పత్తి పంట ఉంచరాదన్నారు. గులాబి రంగు పురుగు లేకుండా చేసేందుకు రోటవేటర్ సాయంతో మొదలను భూమిలో కలయదున్నాలన్నారు. వీఏఏ హర్ష ఉన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట శేషారామ్ అపార్టుమెంట్ నుంచి వివాహిత అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. నరుకుళ్లపాడు పీఏసీఎస్ సీఈఓగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు భార్య విజయలక్ష్మి కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ నెల 14న మధ్యాహ్నం దుస్తుల బ్యాగ్‌తో అపార్టుమెంట్ బయట ఆటో ఎక్కి వెళ్లిపోయిందని భర్త వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ ఏవీ బ్రహ్మం తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 94407 96217 నంబరుకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో వెలుగులోకి సృజనాత్మకత



వెల్దుర్తి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్ అన్నారు. శనివారం వెల్దుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆయన పాల్గొని, మాట్లాడారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఆ దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. వారు తయారు చేసిన వివిధ ప్రాజెక్టుల నమూనాలను పరిశీలించారు. విద్యార్థులను, గైడ్ టీచర్లను అభినందించారు. అనంతరం శిరిగిరిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పదో తరగతి విద్యార్థులకు వేణుగోపాల్ పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, బాదరయ్య, సుజాత, కేశవరావు పాల్గొన్నారు.

పుణ్య ప్రదం.. ధనుర్మాసం

- మొదలైన సంక్రాంతి శోభ
- ఆకట్టుకోనున్న రంగ వల్లులు
- తెలుగు సంప్రదాయాలకు ప్రతీక
- పవిత్ర మాస పూజలకు సర్వం సిద్ధం
- జనవరి 14 వరకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

సత్తెనపల్లి: తెలుగు సంస్కృతికి, సనాతన సంప్రదాయాలకు, ఆచార్య వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగకు పల్లెలు ముస్తాబవుతున్నాయి. మార్గశిర శుక్ల పంచమి రోజైన శుక్రవారం అర్ధరాత్రి 12:31 గంటలకు సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడంతో శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైన ధనుర్మాసం ప్రారంభమైంది. దీంతో సామాన్య ప్రజానీకం గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధనుర్మాసాన్ని నెలపట్టుట అని పిలుచుకుంటారు. శనివారం నుంచి వచ్చే జనవరి 15న మకర సంక్రాంతి వరకు నెల రోజులపాటు ఈ ధనుర్మాసం ఉంటుంది. వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పూజలు చేసేందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. వివిధ గ్రామాల్లోని దేవతా మూర్తులు ప్రతి రోజు పల్లకీలో ఊరేగింపుగా వెళ్లి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సంప్రదాయ కళల కోలాహలం

ధనుర్మాసం ప్రారంభం కావడంతో సంప్రదాయ కళల కోలాహలం గ్రామీణ ప్రాంతాల అంతటా వ్యాపించనుంది. తెల్లవారు జామున ఇంటి ముంగిట రంగవల్లులు, హరిదాసు కీర్తనలతో మేలుకొలుపు, సంప్రదాయ పిండి వంటలతో లోగిళ్లు కళకళలాడనున్నాయి. అలాగే సంక్రాంతిని పురస్కరించుకొని ముగ్గులు, ఎడ్ల పందేలను నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. భోగి పిడకలను తయారు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఏడాదికోసారి వచ్చే కొమ్మ దాసులు, గంగిరెద్దులవారు, కోయదాసులు వంటి కళాకారులు గ్రామాల్లో సందడి చేయనున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదు లాంతర్ల సెంటర్లోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయం తో పాటు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైకుంఠ ద్వార (ఉత్తర గోపుర) దర్శనం, జనవరి 11న కూడారై ఉత్సవం, 14న (భోగి) గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

మంత్రి అంబటికి విశ్రాంత ఉద్యోగుల సత్కారం



మంత్రి అంబటిని సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

సత్తెనపల్లి పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో కొంతకాలంగా అద్దె ప్రాతిపదికన దుకాణం నిర్వహించుకుంటున్న వ్యక్తి కాల పరిమితి మించిపోయినా ఖాళీ చేయకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విశ్రాంత ఉద్యోగులు ఎంత ప్రయత్నించినా దుకాణదారుడు ఖాళీ చేయకపోవడంతో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును సంప్రదించారు. మంత్రి చొరవ తీసుకొని గదులు ఖాళీ చేయించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రి అంబటి రాంబాబును సత్కరించి, కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు, సభ్యులు ఉన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

మాట నిలుపుకున్న మంత్రి అంబటి



బసవయ్యకు నగదు అందిస్తున్న సాంబశివరావు

సత్తెనపల్లి: రజకులకు ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని గతంలో ఇచ్చిన హామీని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నెరవేర్చారు. శనివారం రూ.3 లక్షల విరాళం నాయకుల ద్వారా అందించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు గని, వల్లెం నరసింహారావు సమక్షంలో నగదును రజక సంఘ నాయకులు సత్తెనపల్లి బసవయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు చామర్తి ఆంజనేయులు (చిన్నా), బేబ్బులి, ఉల్లంగుల ప్రసాదుబాబు, మందడపు సాయి, దర్శనాల తిరుపతి రావు, సాంబయ్య, కొండా, కురిచేటి నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఏంఈవోలు ప్రసాదరావు, సత్యనారాయణ

పెదకూరపాడు: క్రీస్తు జన్మదినం మానవాళికి శుభదినమని ఏంఈవోలు ఏకుల ప్రసాదరావు, స్యతనారయణ అన్నారు. శనివారం స్థానిక జన చైతన్య సమితి ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల భవనం నందు ప్రత్యేక ప్రతిభావంతులు, జేబీ పాఠశాల విద్యార్థుల సమక్షంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి నిర్వాహకులు బెన్నిబాబు, తాళ్లూరు సాంబశివరావు, ఐఈడీ ఉపాధ్యాయురాలు భారతి, సీఆర్‌పీలు శివ, జ్యోతి జయప్రకాష్, ముస్లిం సోదరులు షేక్ రఫీ, మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సునీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నట్లు ఎంపీపీ యేచూరి సునీత అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు చేరువ చేసే బాధ్యత అధికారులదేనని చెప్పారు. తుపానుకు దెబ్బతిన్న పంటల సమగ్ర నివేదికను తయారు చేసి, రైతులకు నష్ట పరిహారం అందేవిధంగా కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో సీఎం జగన్ పేద ప్రజలకు అందించిన సంక్షేమాలు దేశంలో ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ జీఎల్ఎస్ గుప్తా, ఎంపీటీసీలు పసుపులేటి వెంకట్రామయ్య, బొంతా కృష్ణ, షేక్ హుస్సేన్, కటకం గోపాల్, మల్లికార్జునరావు, ఆంజనేయులు, ఏఓ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

చెన్నకేశవుని సన్నిధిలో పీఆర్కే పూజలు



పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం చెన్నకేశవస్వామిని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కొమ్మారెడ్డి చలమారెడ్డి శుక్రవారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చల్లా ప్రసాద్, ఆలయ అర్చకుడు సత్యనారాయణాచార్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ ప్రమీలా భాయి తేజానాయక్, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా జక్కా



నియామక పత్రం అందజేస్తున్న జక్కా

దుర్గి: ధర్మవరం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జక్కా సీతారామయ్యను మాచర్ల రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని మాచర్ల రైల్వే అధికారి నాయక్‌కు అందజేశారు. నియోజక వర్గ ఇన్‌చార్జి గుమ్మడి నాసరయ్య, నాయకులు సీతారామయ్యను అభినందించారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీఎస్ఎస్ కుమార్ అన్నారు. డిపో పరిధిలోని అమరావతి, అచ్చంపేట రూట్లో లక్కీ డిప్ ద్వారా ప్రయాణికులకు బహుమతులను శనివారం అందించారు. సత్తెనపల్లి – అచ్చంపేట రూట్‌లో క్రోసూరుకు చెందిన ప్రయాణికులు నర్సింహ, ఎస్.కావ్య సత్యశ్రీ, సత్తెనపల్లి–అమరావతి రూట్ లో వైకుంఠపురానికి చెందిన అప్పారావు, అమరావతికి చెందిన ఇ.భవాని బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. ఈ లక్కీ డిప్ నెలలో రెండుసార్లు తీయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులున్నారు.

సేంద్రియ పంటల పరిశీలన



అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్‌లను సేంద్రియ వ్యవసాయ సత్తెనపల్లి డివిజన్ ఇన్‌చార్జి మధుబాబు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు, నూతన సాంకేతిక పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయ పంటల ఏటీఎంలను పరిశీలించారు ఎటువంటి పురుగు మందులు, రసాయన అవశేషాలు లేని కూరగాయాలు, పండ్లు, పంటలకు ప్రపంచ స్థాయి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. ఈ సందర్భంగా న్యూట్రిగార్డెన్‌లను, పంటల ఏటీఎంలను నిర్వహించే మహిళలతో ఆయన మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. మండల సమైక్య ప్రెసిడెంట్ జి.కుమారి, సీసీ బ్రహ్మం, ఎస్ఎఫ్ఏఎస్ నందకుమార్, సైదయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీదేవి, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యాత్ర

దుర్గి: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మండల పరిధిలోని కంచరగుంట గ్రామంలో శనివారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గుమ్మడి నాసరయ్య హాజరై, మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో పేద ప్రజల కోసం రేషన్ బియ్యంతో పాటు రైతులకు పీఎం కిసాన్ వంటి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. బీజేపీ మండల ఇన్‌చార్జి వెలిదండి శ్రీనివాసరావు, కంచరగుంట ఎంపీటీసీ బొంతా కృష్ణ పాల్గొన్నారు.

‘ఆరోగ్యశ్రీ’ పేదల పాలిట వరం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఆరోగ్యశ్రీ కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పేదల పాలిట వరమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైద్యాధికారులతో కలిసి ఆయన ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 2,400కు పైగా వ్యాధులకు ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఏడాదికి వెయ్యి రూపాయల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చుకు సంబంధించిన వైద్యం పూర్తిగా ఉచితంగా అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ రమాదేవీ, డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ సిరి చందన, శిఖాశ్యాంసస్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, టి.అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో పోటీ తత్వాన్ని ప్రదర్శించాలి

సత్తెనపల్లి అర్బన్ సీఐ ప్రభాకర్ రావు



క్రీడాకారులతో సీఐ ప్రభాకరరావు

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడల్లో పోటీ తత్వాన్ని ప్రదర్శించాలని సత్తెనపల్లి అర్బన్ సీఐ పి. ప్రభాకరరావు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో శనివారం బ్యాడ్మింటన్ పవర్ గేమ్ టోర్నమెంట్ నిర్వహించారు. సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని, టోర్నమెంటును ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ వై.రాఘవరెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫ్రెండ్లీ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు డాక్టర్ జి.శ్రీధర్, చందు, రవి, సుబ్బయ్య, బాబావలి, ఎం.ఏడుకొండలు, రమేష్, మధు, వెంకట్, తిరుపతిరావు, కిరణ్, జగదీష్, భాష, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శివకుమారి

ముప్పాళ్ళ: మొక్కజొన్న సాగులో రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే.. పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ బి.శివకుమారి చెప్పారు. మండలంలోని ముప్పాళ్ళ, గోళ్ళపాడు గ్రామాల్లోని మొక్కజొన్న, పసుపు, మినుము, మిరప పొలాలను శనివారం పరిశీలించారు. మొక్కజొన్నలో విత్తనశుద్ధి చేయటం వల్ల 20 రోజుల వరకు కత్తెర పురుగు ఆశించకుండా చేసుకోవచ్చన్నారు. మొక్కజొన్న ఆకుమీద తెల్లగా చారలు కనిపిస్తే అది జింక్‌లో పమని చిలామిన్ జింక్ స్ప్రే చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్ ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో నరసింహారావు

పెదకూరపాడు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను మండల విద్యాశాఖాధికారి రావిపాటి నరసింహారావు శనివారం అచ్చంపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సట్డీమెటీరియల్ విద్యార్థులకు ఏంతో ఉపయోగపడుతుందన్నారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆళ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా వీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, శౌరెడ్డి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, వాసవి, మరియమ్మ, మస్తాన్ వలి పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి

ఈ నెల 26న గురజాలలోని చల్లగుండ్ల గార్డెన్‌లో జరిగే యూటీఎఫ్ మహాసభలను జయప్రదంచేయాలని యూటీఎఫ్ నాయకులు శనివారం కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభించి, ఆడుతున్న ఎమ్మెల్యే

క్రోసూరు: స్థానిక ఎన్ఎస్ కెనాల్స్ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్‌ను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో 35 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆడుదాం –ఆంధ్రా ఆటలకు మద్దతుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.10 వేలు, రూ.5 వేలు, 3 వేలు, రూ.2వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

ప్రజలకు పులిహోర పంపిణీ

కారెంపూడి: పల్నాటి ఉత్సవాలకు శనివారం తరలి వచ్చిన ప్రజలకు కారెంపూడి గోల్డ్ మర్చంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ జరిగింది. ఆర్యవైశ్య సంఘ జిల్లా నాయకుడు ఏలూరి శశి కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోషియేషన్ అధ్యక్షుడు కొలిశెట్టి మల్లికార్జునరావు, ఆర్యవైశ్య సంఘ పెద్దలు వెలుగూరి శేషారావు, కొల్లా సాంబశివరావు, జీవి కృష్ణ, కజ్జం ప్రసాద్, వెలుగూరి శ్రీను పాల్గొన్నారు.

మోడల్ పేపర్లను సద్వినియోగం చేసుకోవాలి

రెంటచింతల: పదో తరగతి విద్యార్థులు వారధి ఫౌండేషన్ సభ్యులు అందజేసిన యూటీఎఫ్–ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు రొక్కం సాల్మన్‌రాజు అన్నారు. శనివారం స్థానిక లూథరన్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందజేశారు. వీటిని ఉచితం అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. వారధి ఫౌండేషన్ అధ్యక్షుడు టి.అనంద్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు వి.నాగేశ్వరరావు, పీసీహెచ్ నాసరయ్య, వీజేవి రాజ్‌కుమార్, ఓర్సు సాగరబాబు పాల్గొన్నారు.

గురజాలలో మొసలి కలకలం

గురజాల : నగర పంచాయతిలోని లక్ష్మీటాకీస్ సెంటర్‌లో మొసలి కలకలం రేపింది. హద్దుల కుంట వద్ద శుక్రవారం రాత్రి మొసలి కుంట ఒడ్డున సేద తీరుతున్న సమయంలో కంట పడటంతో సమీపంలోని ఇంటి యజమాని భయంతో కేకలు వేశాడు. స్థానికులు వచ్చి చూడగా మొసలి అక్కడి నుంచి కుంటలోకి జారుకుంది. కుంటకు సమీపంలో నివాస ప్రాంతాలు, పశువుల పాకలు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కుంటలో మొసలి ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు జాగ్రత్తగా ఉండాలని త్వరలో మొసలిని పట్టుకుంటామని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ రేపు

దుర్గి: మండల పరిధిలోని మంగాపురం తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం ప్రతిష్ఠ సోమవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పీఆర్కే రూ.50వేలు, వైఎస్సార్ సీపీ నాయకుడు మాదాసు వెంకటేశ్వర్లు రూ.50వేలు వితరణతో అన్నదానం చేయనున్నట్లు వివరించారు.